

రుణం పేరుతో వల

సైబర్ నేరగాళ్ల నయా మోసం

ఫేస్‌బుక్‌లో లోన్ యాప్

నోటిఫికేషన్‌లు క్లిక్ చేస్తే మోసగాళ్ల వలకు చిక్కినట్టే

ఇటీవల పెరుగుతున్న కేసులు

7

పంట నష్టంపై అంచనా

- చింతపల్లి సబ్ డివిజన్‌లో నీట మునిగిన 1,310 ఎకరాలు
- గ్రామాల్లో సర్వే కొనసాగిస్తున్న వ్యవసాయ సిబ్బంది
- పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక
- వ్యవసాయశాఖ సహాయక సంచాలకులు జాహ్నవి
- జీకేవీధి మండలంలోని నాలుగు పంచాయతీల్లో 435 ఎకరాలకు నష్టం



గూడెంకొత్తవీధిలో పంట పొలాలను శనివారం పరిశీలిస్తున్న డీఏవో నంద్, ఏడీఏ జాహ్నవి

చింతపల్లి, సెప్టెంబరు 15: బంగాళాఖాతంలో ఇటీవల తీవ్ర వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో 1,310 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని స్థానిక వ్యవసాయశాఖ సహాయక సంచాలకులు(ఏడీఏ) కంటా జాహ్నవి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత ఆదివారం గిరిజన ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు రైతులు పంటలను నష్టపోవాల్సి వచ్చిందన్నారు. గూడెంకొత్తవీధి మండలంలో భారీగా పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రాథమిక సర్వే ప్రకారం చింతపల్లి మండలంలో 250 ఎకరాల్లో వరి, 10 ఎకరాల్లో రాగి, ఐదు ఎకరాల్లో మొక్కజొన్న, ఐదు ఎకరాల్లో సామ పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. గూడెంకొత్తవీధిలో వెయ్యి ఎకరాల్లో వరి, 15 ఎకరాల్లో వేరుశనగ, 15 ఎకరాల్లో రాగి, 5 ఎకరాల్లో సామ, కొయ్యూరులో ఐదు ఎకరాల్లో వరి పంటలకు నష్టం జరిగిందన్నారు. ప్రస్తుతం మూడు మండలాల్లో వ్యవసాయ అధికారులు, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పర్యటిస్తూ సర్వే చేస్తున్నారన్నారు. మరో ఐదు రోజుల్లో తుది నివేదిక వస్తుందన్నారు. ప్రాథమిక సర్వే ఆధారంగా 1,310 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. ప్రభుత్వం పంట నష్టం విడుదల చేయగానే రైతులకు అందజేస్తామని చెప్పారు. రైతులు పంట నష్టంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వర్షాలు తెరిపి ఇవ్వడంతో పంటలను సంరక్షించుకునే సస్యరక్షణ చర్యలను రైతులు ప్రారంభించాలన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు రైతులు పంటలను కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.



జీకేవీధి మండలం తోకరాయిలో భారీ వర్షాలకు రాళ్లు, బురద ముంచెత్తిన వరి పంటపొలాలను పరిశీలిస్తున్న అధికారులు



చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలోని గొర్లపల్లిలో కొట్టుకుపోయిన వరి పంట పొలాలు

నాలుగు పంచాయతీల్లో..

సీలేరు: జీకేవీధి మండలం దారకొండ, గుమ్మిరేవుల, దుప్పులవాడ, సీలేరు పంచాయతీల్లో ఆదివారం ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులు భారీ వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. నాలుగు పంచాయతీల పరిధిలో 435 ఎకరాల పంటకు నష్టం జరిగిందని, 54 ఇళ్లకు నష్టం వాటిల్లగా, అందులో 7 ఇళ్లు పూర్తిగా, 47 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్టు గుర్తించారు. ఐదు పాఠశాల భవనాలు, 15 చెక్ డ్యామ్‌లు దెబ్బతిన్నట్టు నిర్ధారించారు. ఐదు వంతెనలు, ఐదు చిన్న కల్వర్టులకు నష్టం వాటిల్లిందని, 8 గ్రావిటీ స్కీమ్‌లకు నష్టం జరిగినట్టు గుర్తించారు. మూడు అంగన్‌వాడీ భవనాలు, మూడు తారు రోడ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, 12 జతల ఎడ్లు, 60 కోళ్లు మృతి చెందినట్టు మండల స్థాయి అధికారులు నివేదికలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ పాపారావు, మండల వ్యవసాయాధికారి మధుసూదన్, హౌసింగ్ ఏఈ సూరిబాబు, సీలేరు, దుప్పులవాడ కార్యదర్శులు శ్రీనివాస్, వెంకటరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమరాణి, సర్పంచ్ పి.దుర్గో, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వారం రోజులు ఇబ్బంది పడ్డాం

జీకేవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని మాదిమళ్లు, చోడిరాయి తదితర గ్రామాల్లో వరద నష్టాన్ని అంచనా వేయడానికి వెళ్లిన అధికారులను స్థానికులు నిలదీశారు. భారీ వర్షాల కారణంగా విద్యుత్ సౌకర్యం, తాగునీరు లేక వారం రోజులపాటు ఇబ్బందులు పడ్డామని, వంతెనలు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయని చెప్పారు. ఇంత జరిగినా మంత్రులు, కలెక్టర్, ఐటీడీఏ పీవో ఎందుకు రాలేదని నిలదీశారు. ఉన్నతాధికారులు వచ్చి పరిశీలిస్తేనే కదా తమ బాధలు తెలుస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఒకేసారి రెండు డిగ్రీలు

- ఏయూలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేందుకు సన్నాహాలు
- విద్యార్థికి ఆసక్తి ఉన్న రెండు కోర్సులు ఒకేసారి పూర్తి చేసి సర్టిఫికెట్లు పొందేందుకు అవకాశం
- ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచడమే లక్ష్యం
- నూతన విద్యా విధానం-2020లో భాగంగా ప్రారంభం
- ఇప్పటికే ఇంజనీరింగ్‌లో మిగిలిన బ్రాంచీల విద్యార్థులకు మూడో ఏడాది సీఎస్‌ఈ చేసేందుకు వెసులుబాటు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

డిగ్రీ పట్టాలతో బయటకు వస్తున్న వారికి ఆశించిన స్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభించడం లేదు. దీనికి కారణం విద్యార్థుల్లో ఆశించిన స్థాయిలో నైపుణ్యాలు లేకపోవడమేనని పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం-2020 పేరుతో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో ఒకేసారి విద్యార్థి రెండు డిగ్రీలు పొందే అవకాశాన్ని కల్పిస్తోంది. ఇప్పటికే జాతీయ వర్సిటీల్లో ఈ విధానాన్ని అమలు చేస్తుండగా, రాష్ట్ర యూనివర్సిటీల్లోనూ ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఏయూ అధికారులు వచ్చే విద్యా సంవత్సరం నుంచి పీజీలో డ్యూయల్ డిగ్రీ అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. అంటే ఒకేసారి రెండు పీజీ కోర్సులు పూర్తిచేసే అవకాశాన్ని విద్యార్థులకు కల్పించనున్నారు.

విద్యార్థికి ఆసక్తి ఉన్న రెండు విభిన్నమైన కోర్సులను ఒకేసారి పూర్తిచేసేందుకు అవకాశం లభించనుంది. ఉదాహరణకు ఎంఏ పాలిటిక్స్ చేసే విద్యార్థి ఈ కోర్సు చదువుతూనే, ఎం.కామ్ చేసుకునే అవకాశం ఉంది. ఈ రెండు కోర్సులను ఒకేసారి పూర్తిచేసి ఒకవైపు ఎంఏ పాలిటిక్స్, మరోవైపు ఎంకామ్ డిగ్రీలను పొందవచ్చు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, అకడమిక్ సెనేట్ ఆమోదం కోసం వేచి చూస్తున్నామని, అనుమతి వచ్చిన వెంటనే ప్రారంభిస్తామని వర్సిటీ అధికారులు చెబుతున్నారు.

కోర్సులు డిజైన్ చేసే యోచన

డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌ను అమలు చేయాలని భావిస్తున్న ఏయూ అధికారులు ఎక్కువ మంది విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండే కోర్సులను డిజైన్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. రెండు డిగ్రీలతో బయటకు వెళ్లిన వెంటనే ఏదో ఒక డిగ్రీ పట్టాతో ఉద్యోగం లభించేలా డిజైన్ చేయబోతున్నారు. డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌కు సంబంధించిన కోర్సులు డిజైన్, సబ్జెక్టులు, పరీక్షలు నిర్వహణ వంటి అంశాలకు ... మిగతా 8వ పేజీలో

ఉపాధి అవకాశాలు మెరుగు

-ప్రొఫెసర్ జి.శశిభూషణరావు, ఏయూ వైస్ చాన్సలర్



డ్యూయల్ డిగ్రీ విధానంతో విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుంది. ఒకేసారి రెండు ప్రధానమైన డిగ్రీలను పొందడం వల్ల మార్కెట్‌లో ఏ డిగ్రీకి డిమాండ్ ఉందో దానికి సంబంధించిన ఉద్యోగాల్లో చేరేందుకు అవకాశం ఉంటుంది. దీనివల్ల నిరుద్యోగం చాలావరకు తగ్గుతుంది. అదే సమయంలో విద్యార్థులకు విభిన్న అంశాలపై నాలెడ్జ్ పెరుగుతుంది. ప్రస్తుతం ఇంజనీరింగ్ విద్యార్థులకు మేజర్, మైనర్ కాన్సెప్ట్‌తో ఈ విధానాన్ని అమలు చేస్తున్నాం. మూడో ఏడాది చదువుతున్న విద్యార్థులు మైనర్ సబ్జెక్ట్‌గా కంప్యూటర్ సైన్స్ ఎంపిక చేసుకునే అవకాశం కల్పించాం. వచ్చే ఏడాది నుంచి పీజీ కోర్సుల్లో అమలు చేయాలని భావిస్తున్న డ్యూయల్ డిగ్రీ విధానంలో మాత్రం రెండు కోర్సులు సబ్జెక్టులు మేజర్‌గానే ఉంటాయి.

ప్రతి శుక్రవారం విద్యుత్ లైన్ల నిర్వహణ

ఏ సమస్య ఉన్నా 1912కు కాల్ చేస్తే చాలు

- పీఎం జన్‌మన్‌లో ఆదివాసీలకు విద్యుత్ సరఫరా
- 'ఆంధ్రజ్యోతి'తో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



సీఎండీ పృథ్వీతేజ్



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)లో ప్రతి శుక్రవారం విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపట్టాలనే నిబంధన అమలు చేస్తున్నామని సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ గతంలో వేసవి సీజన్‌కు ముందు ఈ నిర్వహణ పనులు జరిగేవన్నారు. అయితే ఏడాది మొత్తం వదిలేసి, సీజన్‌లోనే చేయడం వల్ల సమస్యలు వస్తున్నాయని గుర్తించి, ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేపట్టాలని ఆదేశించామన్నారు. ఎక్కడైనా చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్‌పై పడితే వెంటనే ట్రిప్ అయి సరఫరా నిలిచిపోతుందని, దీనిని సరిచేయడానికి గంటల సమయం పడుతోందన్నారు. ఇప్పుడు విద్యుత్ సరఫరా పది నిమిషాలు ఆగినా భరించలేని స్థితిలో వినియోగదారులు ఉన్నందున అసలు ఆ సమస్యే రాకుండా ముందుజాగ్రత్తగా ఇలా ప్రతి శుక్రవారం నిర్వహణ పనులు చేయిస్తున్నామన్నారు. దీని వల్ల ట్రిప్ సమస్యతో విద్యుత్ ఆగిపోయే ఘటనలు తగ్గుతున్నాయన్నారు. డిస్కమ్‌లోని అన్ని సర్కిళ్లలోను దీనిని అమలు చేస్తున్నామన్నారు.

150 ప్రాంతాల్లో పీఎం జన్‌మన్ వెలుగులు

ప్రతి ఇంటికీ విద్యుత్ సరఫరా ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యం కాగా కొండల్లో నివసించే కొన్ని గిరిజన గ్రామాలకు విద్యుత్ లైన్లు వేయలేని పరిస్థితి ఉందన్నారు. పోడు వ్యవసాయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు కొండలపై నివాసాలను మార్చుకునే ఆదిమ జాతి గిరిజనులకు విద్యుత్ వెలుగులు అందించేందుకు పీఎం జన్‌మన్ పథకం అమలు చేస్తుండగా, అందులో సుమారు 150 మంది గిరిజన కుటుంబాలకు సోలార్‌తో పనిచేసే విద్యుత్ బల్బులు, ఫ్యాన్, చార్జింగ్ పాయింట్ వంటివి అందించామన్నారు. ఇవన్నీ ఒక ప్యాకేజీ కింద ఉంటాయని, ఒక్కొక్కటి రూ.50 వేలు విలువ చేస్తుందన్నారు. కేవలం సూర్యకాంతితోనే ఇవి పనిచేస్తాయన్నారు.

సేవల్లో లోపం లేకుండా చూస్తున్నాం

డిస్కమ్‌లో ఉండాల్సిన సిబ్బందిలో మూడో ... మిగతా 8వ పేజీలో

సమస్యల ఒడిలో ఆశ్రమ బడి

- డౌనూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో వసతులు కరువు
- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తికాని అదనపు భవన నిర్మాణం
- రెండు పాత నిర్మాణాలను కూల్చి వేయడంతో అవస్థలు
- చాలీచాలని గదుల్లో విద్యార్థుల ఇబ్బందులు

కొయ్యూరు, సెప్టెంబరు 15: మండలంలోని డౌనూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో సమస్యలు తిష్ట వేశాయి. విద్యార్థులకు సరిపడా గదులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల నూతన భవనం నిర్మాణ పనులు నిలిచిపోవడంతో అవస్థలు తప్పడం లేదు.

డౌనూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో 269 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో 12 గదులతో ఒక భవనం మాత్రమే ఉంది. ఇందులో ఒక గదిని కార్యాలయ నిర్వహణకు, ఒకటి ల్యాబ్‌కు, ఒకటి కంప్యూటర్లకు, మరొక స్టోర్ రూమ్‌గా వినియోగిస్తున్నారు. మిగిలిన ఎనిమిది గదుల్లో 269 మంది విద్యార్థులు పగటి పూట తరగతులకు, రాత్రి వేళ వసతి గృహంగా వినియోగిస్తున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.



పగలు తరగతులకు, రాత్రి వసతికి విద్యార్థులు వినియోగించుకుంటున్న గది



అసంపూర్తిగా ఉన్న అదనపు వసతి భవనం

అసంపూర్తి నిర్మాణాలతో అవస్థలు

గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం రెండవ విడత కింద అదనపు వసతి భవనం నిర్మించాలని నిర్ణయించింది. దీని కోసం రేకులతో నిర్మించిన విశాలమైన భవనంతో పాటు దానికి ఆనుకుని ఉన్న మరో రెండు గదులున్న మరో భవనాన్ని కూల్చి వేసింది. నూతన భవన నిర్మాణానికి పనులు చేపట్టి రెండు అంతస్థులకు శ్లాబ్ వేశారు. అయితే అక్కడి నుంచి పనులు ముందుకు సాగడం లేదు. సిమెంట్ లేకపోవడం వల్లే పనులు జరగడం లేదని ఇంజనీరింగ్ అధికారులు ... మిగతా 8వ పేజీలో

వైద్యురాలి బదిలీ సబబేనా?

- వైద్య ఆరోగ్యశాఖకు మినహాయింపు ఉన్నా ముందుకే..
- కూటమి నేత సిఫారసుతో నర్సీపట్నం సీఎస్‌ఆర్‌ఎంవోగా నియమించారని ప్రచారం
- ప్రత్యామ్నాయంగా పోస్టు భర్తీ చేయకపోవడంపై స్థానికుల అసహనం

చింతపల్లి, సెప్టెంబరు 15: వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వ మినహాయింపు ఉన్నప్పటికీ చింతపల్లి ఏరియా ఆస్పత్రికి చెందిన గైనికాలజిస్టును నర్సీపట్నం బదిలీ చేస్తూ ఏపీవీవీపీ(ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్) డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశమైంది. కలెక్టర్, ఐటీడీఏ పీవో అనుమతిస్తే ఆమె బదిలీ లాంఛనమేనని అంటున్నారు.

గిరిజన ప్రాంతంలో వైద్యుల కొరత అధికంగా ఉంది. ప్రత్యేక వైద్యనిపుణులు ఏజెన్సీలో పనిచేసేందుకు ముందుకు రావడంలేదు. కాగా ఏపీవీవీపీ అధికారులు స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యాధికారిని బదిలీ చేయడం, ఆమె స్థానంలో ప్రత్యామ్నాయంగా మరో వైద్యాధికారిని నియమించకపోవడంపై ఈ ప్రాంతవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో ఏడాదిన్నర కాలంగా సివిల్ సర్జన్ గైనికాలజిస్టుగా డాక్టర్ ఎన్‌వీఎస్ సుధాశారద పనిచేస్తున్నారు. ఆమె నర్సీపట్నంలో నివాసముంటున్నారు. ప్రతి రోజూ నర్సీపట్నం నుంచి చింతపల్లి ఏరియా ఆస్పత్రికి వచ్చి విధులు నిర్వహించి వెళుతుంటారు. సివిల్ సర్జన్ కావడంతో ఆమె రాత్రి వేళ విధులు నిర్వహించడం లేదు.

తాజాగా కూటమికి చెందిన కేబినెట్ స్థాయి రాజకీయనేత సిఫారసుతో ఏపీవీవీపీ అధికారులు సుధాశారదను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి సీఎస్ ఆర్‌ఎంవోగా నియమిస్తూ బదిలీ చేశారని ప్రచారం జరుగుతోంది. సాధారణంగా బదిలీల సమయంలో మాత్రమే వైద్యులకు స్థానచలనం జరుగుతుంది. అయితే గైనికాలజిస్టు సుధాశారదను మధ్యంతరంగా డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ బదిలీ చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. గిరిజన ప్రాంతంలో ఐటీడీఏ పరిధిలో ఏ ఉద్యోగి ... మిగతా 8వ పేజీలో

సరియా జలపాతంలో ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యం

వెలికితీసిన ఏపీఎస్‌ఆర్‌డీఎఫ్, అగ్నిమాపక, నేవీ బృందాలు

శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

-వార్త 7వ పేజీలో..

గిరిజన రైతులతో బంతిపూల సాగు

- విత్తనాలు, ఎరువులు ఉచితంగా పంపిణీ
- థింసా ఆర్గానిక్ ఎఫ్‌పీవో మార్కెటింగ్ మేనేజర్ ఆనంద్



పీఎస్‌జే ఆనంద్

చింతపల్లి, సెప్టెంబరు 15: గిరిజన రైతులతో బంతిపూల సాగు చేపట్టేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని థింసా ఆర్గానిక్ రైతు ఉత్పత్తిదారుల సంఘం మార్కెటింగ్ మేనేజర్ పీఎస్‌జే ఆనంద్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో రైతులకు ఎఫ్‌పీవో ద్వారా ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందజేసి పంటకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతు తన సొంత పొలంలో బంతి నాట్లు వేసుకోవాలన్నారు. పంట దిగుబడులను ఎఫ్‌పీవో కొనుగోలు చేస్తుందన్నారు. ఔషధ గుణాలు కలిగిన బంతి విత్తనాలను రైతులకు అందజేయడం వల్ల మార్కెటింగ్ సమస్య ఉండదన్నారు. ఆసక్తిగల రైతులు విత్తనాలు, ఎరువులు, పూర్తి సమాచారం కోసం 7981637171 ఫోన్ నంబర్‌ను సంప్రతించాలని కోరారు.

సమైక్యం.. మార్గం సుగమం

రహదారి క్లియరెన్స్‌కు నడుం బిగించిన గిరి యువత..కిముడుపల్లి, వేంగడ ఘాట్ రోడ్లలో మరమ్మతు పనులు

శ్రమదానానికి తరలివచ్చిన గిరిజనులు

-వార్త 8వ పేజీలో..

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో వడ్డాది వాసి దుర్మరణం



మృతి చెందిన అప్పారావు(ఫైల్‌ఫొటో)

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 15: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి వెళ్తున్న వడ్డాదికి చెందిన ఓ వ్యక్తి పెద్దాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో వడ్డాదిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబీకుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.

వడ్డాది రెల్లి కాలనీకి చెందిన భూపతి అప్పారావు (41) పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటూ కుటుంబాన్ని పోషిస్తుంటాడు. గుంటూరులో జరుగుతున్న చవితి ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొనడానికి వడ్డాది నుంచి బృందంతో కలిసి వెళ్లాడు. శనివారం సాయంత్రం పత్తిపాడు దగ్గర ధర్మవరం సెంటర్‌లో టిఫిన్ చేయడానికి రోడ్డుపై నడిచి వెళుతున్న అప్పారావును కారు బలంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అప్పారావును పెద్దాపురం ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం వైద్యుల సిఫార్సు మేరకు కాకినాడకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. జీవనోపాధికి వెళ్లి అప్పారావు మృతి చెందడంపై భార్య, ఇద్దరు పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వాచ్‌మన్ మృతి



మృతుడు అప్పలరాజు

విశాఖపట్నం, సెప్టెంబరు 15 : ఎండాడ పెట్రోల్ బంక్ సమీపంలో ఓ వాచ్‌మన్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..ఎండాడ వివేకానందనగర్ పార్కు సమీపంలో సాయితేజ అపార్టుమెంట్‌లో పొట్నూరు అప్పలరాజు (35) వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం బైక్ మీద ఎండాడ పెట్రోల్ బంక్‌కు వచ్చాడు. పెట్రోల్ కొట్టించుకుని బంక్ నుంచి వస్తూ అక్కడికి సమీపంలో ఉన్న స్క్రాప్ దుకాణం ముందు మెట్లపై మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పలరాజు స్వగ్రామం అనకాపల్లి సమీపంలోని తిరువూరు. అతనికి భార్య భవానీ, ఎనిమిదేళ్ల కుమార్తె ఉన్నారు. సాయితేజ అపార్ట్‌మెంట్‌లో ఆయన కొన్నేళ్లుగా వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై హత్యాయత్నం

నర్సీపట్నం, సెప్టెంబరు 15 : కట్టుకున్న భార్యను హత్య చేసేందుకు భర్త కత్తితో పొడిచిన ఘటన నర్సీపట్నం వెలమవీధిలో చోటుచేసుకుంది. ఆదివారం పట్టణ ఎస్ఐ ఉమామహేశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక వెలమవీధిలో నివాసం ఉంటున్న కరెడ్ల వెంకటగణేశ్వరరావు భార్య సత్యవతిని మానసికంగా, శారీరంగా తరచూ వేధించేవాడని, పుట్టింటి నుంచి డబ్బులు తీసుకు రమ్మని కొట్టేవాడని ఎస్ఐ తెలిపారు. శనివారం రాత్రి భార్యను చంపాలన్న ఉద్దేశంతో వెంకటగణేశ్వరరావు కత్తితో పొడిచి తీవ్రంగా గాయపరిచాడన్నారు. బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతుందని, ఆమె తల్లి పి.రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సరియాలో ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యం

- వెలికితీసిన ఏపీఎస్‌ఆర్‌డీఎఫ్, అగ్నిమాపక, నేవీ బృందాలు
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు



సాయికుమార్ మృతదేహం



దిలీప్‌కుమార్ (ఫైల్ ఫొటో)

అనంతగిరి, సెప్టెంబరు 15: సరియా జలపాతంలో ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. శనివారం సాయంత్రం ఆ యువకులు గల్లంతుకాగా, ఆదివారం ఉదయం నుంచి జలపాతం వద్ద ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్, నేవీ, అగ్నిమాపక సిబ్బంది ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. దీనికి సంబంధించి అనంతగిరి ఎస్ఐ కరక రాము, డిప్యూటీ తహసీల్దార్ మాణిక్యం అందించిన వివరాలిలా ఉన్నాయి. అనంతగిరి మండలంలోని జీనబాడు పంచాయతీ పరిధిలో ఉన్న సరియా జలపాతాన్ని తిలకించేందుకు విజయనగరం జిల్లా కేంద్రంలోని బాబామెట్టకు చెందిన లంక సాయికుమార్ (33) మరో ముగ్గురు స్నేహితులతోను, బిహార్ రాష్ట్రానికి చెందిన విశాఖపట్నం నేవీ ఉద్యోగి దిలీప్‌కుమార్ (31) తోటి ఉద్యోగులతోను కలిసి జలపాతం తిలకించేందుకు శనివారం వచ్చారు. లంక సాయికుమార్ బహుబలి జలపాతం వద్ద స్నానం చేస్తుండగా ఒక్కసారిగా లోతైన ప్రదేశం వద్ద ప్రమాదవశాత్తూ జారిపడ్డాడు. దీన్ని గమనించిన నేవీ ఉద్యోగి దిలీప్‌కుమార్ కాపాడేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో సాయికుమార్‌తో పాటు దిలీప్ కూడా గల్లంతయ్యాడు. శనివారం రాత్రి వరకు అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ వారి ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం ఉదయం ఎస్ఐ రాము, డీటీ మాణిక్యం పర్యవేక్షణలో ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్, నేవీ, అగ్నిమాపక సిబ్బంది ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో జలపాతం డేంజర్ పాయింట్ వద్ద దిలీప్‌కుమార్ మృతదేహం, 2.30 గంటల సమయంలో బాహుబలి జలపాతం వద్ద లంక సాయికుమార్ మృతదేహం లభ్యమయ్యాయి. అతి కష్టమ్మీద రెండు మృతదేహాలను బయటకు తీసి, తాడు సాయంతో గెడ్డను దాటించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను శృంగవరపుకోట సీహెచ్‌సీకి తరలించినట్టు ఎస్ఐ రాము తెలిపారు.

కన్నీరుమున్నీరైన కుటుంబీకులు, బంధువులు

లంక సాయికుమార్, దిలీప్‌కుమార్ మృతి చెందారని తెలియగానే కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు సరియా జలపాతం వద్దకు చేరుకున్నారు. సాయికుమార్ మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబానికి దిక్కు ఎవరంటూ రోదించడం చూసిన వారు కూడా కంట తడి పెట్టారు. అలాగే దిలీప్‌కుమార్ మృతదేహం వద్ద తోటి ఉద్యోగులు కన్నీరు పెట్టారు. సరదాగా గడిపేందుకు వచ్చి, మృత్యువాత పడడంతో శోకసంద్రంలో మునిగిపోయారు. ఆర్ఐలు శంకరరావు, లక్ష్మీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరంపై పోలీసులు కేసు నమోదు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 15 : సైబర్ క్రైమ్‌పై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయక కథనం ప్రకారం వివరాలివి. పట్టణంలోని గవరపాలెనికి చెందిన మళ్ల పవన్ మణికంఠ ప్రముఖ ఆన్‌లైన్ వ్యాపార సంస్థలో ఉద్యోగానికి ఇటీవల పరీక్ష రాశాడు. అయితే ఈ ఏడాది జనవరి 31వ తేదీన మణికంఠకు సదరు కంపెనీ పేరు మీద అజ్ఞాత వ్యక్తి వాట్సాప్‌లో యాడ్ చేశాడు. దీంతో తాను పరీక్ష రాసిన కంపెనీయే అని నమ్మాడు. పార్ట్ టైమ్ జాబ్ కల్పిస్తామని అజ్ఞాత వ్యక్తి మెసేజ్ పెట్టగా ఆయన పంపిన లింక్‌లో బయోడేటా పంపించాడు. వెయ్యి రూపాయలు పంపమని వాట్సాప్‌లో కోరగా మణికంఠ సదరు వ్యక్తి సూచించిన అకౌంట్‌కు ఆ మొత్తం వేశాడు. వెనువెంటనే అజ్ఞాత వ్యక్తి మణికంఠను నమ్మించడానికి తిరిగి రూ.1400 వేయడంతో బాగుందని భావించాడు. దఫదఫాలుగా రూ.లక్షా 80వేలు వేసినప్పటికీ అట్నుంచి ఎటువంటి సమాధానం రాకపోగా, ఇంకా డబ్బులు పంపాలని మెసేజ్ రావడంతో అనుమానం వచ్చి ఫిబ్రవరి ఒకటో తేదీన సైబర్ క్రైమ్‌కు ఫోన్ చేశాడు. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులు మణికంఠ పంపిన మొత్తంలో రూ.లక్షా 20వేలను అజ్ఞాత వ్యక్తి అకౌంట్‌కు మళ్లకుండా ఫ్రీజ్ చేశారు. ఈ సంఘటనపై శనివారం రాత్రి బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	97.00
లైవ్ ధర	117.00
విత్ స్కిన్	204.00
స్కిన్ లెస్	214.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544



పార్కు ప్రాంగణం



పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

నందన వనం.. ఆహ్లాదభరితం

- ఈ.బోనంగి పంచాయతీ ఫార్మాసిటీ పునరావాస కాలనీలో ఏర్పాటు
- ఆకట్టుకుంటున్న వివిధ రకాల మొక్కలు
- పిల్లలకు ఆట పరికరాలు.. పెద్దలకు ఓపెన్‌జిమ్‌తో నిత్యం సందడి



పిల్లల ఆడుకునేందుకు పరికరాలు

పరవాడ, సెప్టెంబరు 15 : మండలంలోని ఈ.బోనంగి పంచాయతీ పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీలో ఏర్పాటు చేసిన ఉద్యానవనం ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తోంది. సుమారు 80 సెంట్లకు పైగా స్థలంలో పంచాయతీ నిధులు రూ.40 లక్షలు వెచ్చించి ఆకట్టుకునే విధంగా పార్కును తీర్చిదిద్దారు. కడియం నుంచి మొక్కలు, పచ్చగడ్డి తీసుకువచ్చి పార్కు లోపల పెంచారు. కూర్చోవడానికి బెంచీలు, వెలుగుల నిమిత్తం ఎల్ఈడీ, హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేశారు. పార్కు మధ్యలో బాతుల బొమ్మలను పెట్టి తీర్చిదిద్దిన ఫౌంటైన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పెద్దల కోసం ఓపెన్‌జిమ్, పిల్లలు ఆడుకోవడానికి సామగ్రిని ఏర్పాటు చేశారు. నడక కోసం ఉద్యానవనం చుట్టూ నడకదారిని తీర్చిదిద్దారు. తాగునీటి సదుపాయాన్ని కూడా కల్పించారు. కాలనీవాసులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు, పిల్లలకు, వృద్ధులకు అందుబాటులో ఉండే విధంగా మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో పార్కును నిర్మించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలతో కాసేపు ఆహ్లాదం పొందడానికి వీలుగా కాలనీలో పార్కును ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందని అంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కాసేపు సేద తీరేందుకు పార్కు ఎంతగానో ఉపయోగపడుతుంది.

నక్కపల్లిలోనే గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలి

- కారిడార్ నిర్వాసిత రైతుల డిమాండ్



రైతులతో కలిసి విలేకర్లతో మాట్లాడుతున్న నాయకులు

నక్కపల్లి, సెప్టెంబరు 15 : విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం మండలంలో భూములిచ్చిన నిర్వాసిత రైతుల సమస్యలు తెలుసుకోవడానికి ఈ నెల 17వ తేదీ మంగళవారం నక్కపల్లిలోనే గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. చందనాడ సమీపంలో ఆదివారం సాయంత్రం కారిడార్ నిర్వాసిత రైతులతో కలిసి వారు విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 17న కారిడార్ నిర్వాసిత రైతుల సమస్యలు తెలుసుకోవడానికి హోం మంత్రి అనిత, కలెక్టర్‌తో అనకాపల్లిలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని తొలుత చెప్పారన్నారు. కానీ హోం మంత్రి, కలెక్టర్‌కు బదులుగా ఆర్‌డీవో, ఎస్‌డీసీ స్థాయి అధికారులతో అనకాపల్లిలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం తగదని పేర్కొన్నారు. ఐదు రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న ఎంతో మంది నిర్వాసిత రైతులకు ఇంకా పరిహారం, ప్యాకేజీ రాలేదని, గృహాలకు సంబంధించి పరిహారం కూడా ఇవ్వలేదని తెలిపారు. అటువంటప్పుడు రైతులంతా కలిసి అనకాపల్లి రావడం కష్టమవుతుందన్నారు. అందువల్ల ఎస్‌డీసీ, ఆర్‌డీవో, తహసీల్దార్లు, ఏపీఐఐసీ అధికారులతో నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలోనే గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ కార్యాచరణ ప్రణాళికను తామే రూపొందించుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం ప్రతినిధులు గంటా తిరుపతిరావు, సూరకాసుల గోవింద్, వెలగా ఈశ్వరరావు, తళ్లా భార్గవ్, ఎం.రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

విశాల్‌గున్ని సస్పెన్షన్‌పై విశాఖలో కలకలం

- 2013లో నర్సీపట్నం ఏఎస్పీగా గున్ని కెరీర్ ప్రారంభం
- ముంబైకి చెందిన సినీ నటి జత్వానీ ఫిర్యాదు మేరకు వేటు
- విశాల్ సస్పెన్షన్ స్వయంకృతాపరాధమేనని జోరుగా చర్చ

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారి విశాల్ గున్ని సస్పెన్షన్ నగర పోలీస్ వర్గాల్లో కలకలం రేపింది. ముంబైకి చెందిన సినీ నటి కాదంబరీ జత్వానీ ఫిర్యాదు మేరకు విజయవాడ పోలీసులు ముగ్గురు పోలీస్ ఉన్నతాధికారులపై కేసు నమోదుచేశారు. వారిలో విశాల్ గున్ని ఒకరు. 2010 కేడర్‌కు చెందిన విశాల్ 2013లో నర్సీపట్నం ఏఎస్పీగా కెరీర్ ప్రారంభించారు. రెండేళ్ల పని చేశారు. సుమారు తొమ్మిదేళ్ల తరువాత ఈ ఏడాది ఫిబ్రవరి 12న విశాఖ రేంజ్ డీఐజీగా బాధ్యతలు స్వీకరించారు. కొద్దిరోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా గత ప్రభుత్వ పాలకుల సిఫారసుల మేరకు సీఐలకు పోస్టింగ్స్ ఇచ్చారనే విమర్శలున్నాయి. రేంజ్‌లో మొత్తం 22 మంది సీఐలకు పోస్టింగ్స్ ఇవ్వకుండా వీఆర్‌లో ఉంచారు. పలువురు సీఐలను టార్గెట్ చేసేవారని విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులకు పలువురు ఫిర్యాదు చేశారని, ఈలోగా ప్రభుత్వం మారడంతో జూలై 17న అతనిని బదిలీ చేసి డీజీపీ కార్యాలయంలో రిపోర్టుచేయాలని ఆదేశించింది. కాగా విశాల్ గున్ని సస్పెన్షన్ స్వయంకృతాపరాధమేనని ఆ శాఖలోని పలువురు అధికారులు చర్చించుకుంటున్నారు.

రుణం పేరుతో వల..

సైబర్ నేరగాళ్ల నయా మోసం

- ఫేస్‌బుక్‌లో లోన్ యాప్ నోటిఫికేషన్‌లు
- క్లిక్ చేస్తే మోసగాళ్ల వలకు చిక్కినట్టే
- రిజిస్ట్రేషన్ ఫీజు పేరుతో మొదట కొద్ది మొత్తం వసూలు
- ఆ తర్వాత ఆశల్లో ముంచుతూ విడతల వారీగా అందినంత దోపిడీ
- నగరంలో ఇటీవల పెరుగుతున్న కేసులు
- అన్నీ ఇతర దేశాల నుంచి నిర్వహిస్తున్నవే



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మధురవాడ ప్రాంతానికి చెందిన ఒక మహిళకు సెల్ ఫోన్‌లో ఫేస్‌బుక్ చూడడం అలవాటు. ఈనెల 10న ఫేస్‌బుక్ చూస్తుండగా ఇన్‌స్టెంట్ లోన్ అంటూ ఇండియా బుల్స్ పేరుతో ఒక నోటిఫికేషన్ కనిపించింది. దానిపై క్లిక్ చేయగానే రూ.3 లక్షలు వరకూ లోన్ ఇస్తామని ఉండడంతో వివరాలు ఎంటర్ చేశారు. అటు నుంచి బ్యాంకు ప్రతినిధినంటూ ఒకరు ఫోన్ చేసి విడతల వారీగా రూ.96 వేలు వరకూ గుంజేశారు.

రామ్‌నగర్‌కు చెందిన 26 ఏళ్ల స్టాఫ్ నర్సు కొద్దిరోజులు కిందట షటిల్ లోన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని లోన్ కోసం అప్లై చేశారు. వెంటనే ఆమెకు ఒకరు కాల్ చేసి లోన్ ఇస్తామని నమ్మించి దశల వారీగా రూ.20 వేలు లాగేశారు. ఇంకా కొన్ని ఫీజులు కట్టాలని కోరడంతో ఆమెకు మోసగాళ్ల పనేనని అర్థం కావడంతో అతని నంబర్‌ను బ్లాక్‌లో పెట్టేశారు.

నగరంలో ఇన్‌స్టెంట్ రుణాల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. ఫేస్‌బుక్‌లో ఇన్‌స్టెంట్ లోన్ యాప్, వెబ్‌సైట్‌ల పేరుతో కొన్ని నోటిఫికేషన్‌లను పెడుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారు, వెంటనే రుణం వచ్చేస్తుందని ఆ నోటిఫికేషన్ లింక్‌లను క్లిక్ చేస్తున్నారు. లింక్‌ను క్లిక్ చేయగానే ఫోన్ నంబర్, రాష్ట్రం ఎంటర్ చేయాలని అడుగుతుంది. ఆ మేరకు తమ వివరాలను ఎంటర్ చేస్తున్నారు. ఫోన్ నంబర్ ఎంటర్ చేయగానే సైబర్ నేరగాళ్లు లైన్‌లోకి వచ్చేస్తున్నారు. బాధితులకు ఫోన్ చేసి ఎంత రుణం కావాలని మాటలు మొదలుపెట్టి, వారికి ఆ క్షణంలోనే రుణం మంజూరు చేసేస్తున్నట్టు ఫోన్‌పే నంబర్, బ్యాంకు ఖాతా వివరాలను అడిగి హడావిడి చేస్తున్నారు. ఆ తరువాత లోన్ మంజూరు చేయడానికి ముందు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది కాబట్టి, ఫీజు కింద రూ.2,500 తాము చెప్పే నంబర్‌కు ఫోన్ పే చేయాలని కోరుతున్నారు. రూ.మూడు లక్షలు/రూ.ఐదు లక్షలు రుణం ఇస్తున్నప్పుడు రూ.2,500 కట్టడం పెద్ద లెక్క కాదన్నట్టు సైబర్ నేరగాళ్లు చెప్పిన నంబర్‌కు లోన్ అవసరమైనవారు ఫోన్ పే చేసేస్తున్నారు. తర్వాత మరొకరు ఫోన్ చేసి లోన్ దరఖాస్తు అందిందని, ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రుణం కోసం ముందుగా కొంత ఫీజు కడితే, ఆ మొత్తంతోపాటు లోన్ మొత్తం కలిపి తిరిగి అకౌంట్‌కు జమ చేస్తామని నమ్మబలుకుతున్నారు. ఇలా బాధితులు మోసాన్ని గుర్తించేంత వరకూ డబ్బును ఏదో ఒక పేరుతో సైబర్ నేరగాళ్లు లాగేస్తున్నారు. ఈనెల పదిన మధురవాడ ప్రాంతానికి చెందిన ఒక మహిళకు ఇదే తరహా అనుభవం ఎదురైంది. ఫేస్‌బుక్ చూస్తుండగా 'ఇండియా బుల్స్' పేరుతో ఒక ఇన్‌స్టెంట్ లోన్‌కు సంబంధించిన లింక్ కనిపించింది. ఆమె రూ.మూడు లక్షలు రుణం వస్తుందని ఆ లింక్‌ను క్లిక్ చేయగా, ఫోన్ నంబర్‌తోపాటు ఇతర వివరాలను ఎంటర్ చేయాలని కోరారు. ఫోన్ నంబర్ ఇవ్వగానే ఒక వ్యక్తి ఫోన్ చేసి హైదరాబాద్ నుంచి అని చెప్పి తెలుగులోనే మాట్లాడారు. రూ.3 లక్షలు రుణం ఇస్తామని అందుకోసం ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పి రూ.2,500 లాగేశారు. తర్వాత అనుమానం రాకుండా ఉండేందుకు బాధితురాలికి ఆర్‌బీఐ పేరుతో ఉన్న ఒక బాండ్‌ను వాట్సాప్‌కు పంపించారు. దీంతో రుణం వస్తుందనే ఆశతో ఉన్న ఆమె సైబర్ నేరగాళ్లు చెప్పినట్టు విడతల వారీగా రూ.96 వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించారు. ఇంకా అడగడంతో తాను ఇప్పటికే అప్పులు చేసి కట్టానని, ఇక అప్పు ఇచ్చేవారు లేరని చెబుతుండగా పక్కింట్లో ఉండే వ్యక్తి విని..విషయం ఏమిటని ఆరా తీయగా జరిగిన ఉదంతాన్ని చెప్పారు. అదంతా మోసం...అని చెప్పడంతో బాధితురాలు వెంటనే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో నేరగాళ్ల అకౌంట్‌లను ఫ్రీజ్ చేయాలని బ్యాంకు అధికారులకు పోలీసులు మెయిల్ పంపించారు. రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఒక స్టాఫ్ నర్సుకు కూడా ఇదే తరహా అనుభవం ఎదురైంది. అయితే ఆమె ప్రాథమిక దశలోనే మోసాన్ని గుర్తించడంతో తక్కువ నష్టంతో బయటపడ్డారు. ఈ తరహా ఉదంతాలు నగరంలో ఇటీవల కాలంలో విపరీతంగా పెరుగుతున్నాయి. చాలామంది అమాయకులు లోన్ యాప్ నిర్వాహకుల ఉచ్చులో చిక్కుకుంటున్నప్పటికీ కొద్దిమంది మాత్రమే పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. మిగిలినవారు పరువు పోతుందనే భయంతో ముందుకురావడం లేదని పోలీసులు చెబుతున్నారు.

విదేశాల నుంచే యాప్‌ల నిర్వహణ

ఇన్‌స్టంట్ లోన్‌యాప్‌ల నిర్వాహకులంతా విదేశాల్లో ఉంటూ కార్యకలాపాలు సాగిస్తున్నారు. బాధితులకు అనుమానం రాకుండా అన్ని భాషలు మాట్లాడగలిగే వారిని ఉద్యోగాల్లో పెట్టుకోవడం, ఏజెంట్ల ద్వారా అన్ని రాష్ట్రాలకు చెందిన సిమ్ కార్డులను సంపాదించడం చేస్తున్నారు. ఏ రాష్ట్రానికి చెందిన వ్యక్తికి ఆ రాష్ట్రానికి చెందిన సిమ్ కార్డు నుంచి ఫోన్ చేసి, ఆ రాష్ట్ర భాషలో మాట్లాడిస్తారు. కాంబోడియా నుంచి ఇదే తరహా మోసాలకు పాల్పడే ముఠా చేతిలో చిక్కుకున్న ఏపీ, తెలంగాణకు చెందిన వందలాది మందిని నగర పోలీసులు ఇటీవల విడిపించి తీసుకువచ్చిన విషయం తెలిసిందే.

99 మీటర్లకు చేరిన కోనాం నీటిమట్టం



కళకళలాడుతున్న కోనాం జలాశయం

చీడికాడ, సెప్టెంబరు 15: మండలంలో కోనాం జలాశయంలో వరదనీటితో కళకళలాడుతుంది. జలాశయం గరిష్ఠ స్థాయి నీటి మట్టం 101.25 మీటర్లు కాగా.. ఆదివారం ఉదయానికి 99 మీటర్లకు చేరుకుంది. ఈ జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో 80 క్యూసెక్కులు వస్తుండగా ఎగువ, దిగువ కాలువలు, గేట్లు లీకేజీ రూపంలో 200 క్యూసెక్కులు బొడ్డేరు నదిలోకి వెళుతున్నది. ఈ ఏడాది ఖరీఫ్‌కు పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తామని ఏఈ సీహెచ్.జయరాం తెలిపారు.

వరద బాధితులకు లారస్ ల్యాబ్స్ రూ.కోటి విరాళం



సీఎం చంద్రబాబుకు రూ.కోటి చెక్కు అందిస్తున్న లారస్ ల్యాబ్స్ సీఈవో సత్యనారాయణ

పరవాడ, సెప్టెంబరు 15 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఫార్మాసిటీలోని లారస్ ల్యాబ్స్ యాజమాన్యం కోటి రూపాయలు సమకూర్చింది. ఇందుకు సంబంధించిన చెక్కును లారస్ ల్యాబ్స్ సీఈవో చావా సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ చావా నాగరాణి కలిసి ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేసినట్టు లారస్ ల్యాబ్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (హెచ్ఆర్ విభాగం) బోడేపూడి రామకృష్ణ తెలిపారు. వరదల వల్ల నష్టపోయిన వారికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి తమ వంతు సాయం అందజేయాలని ఈ సందర్భంగా రామకృష్ణ పిలుపునిచ్చారు.

'బల్లా'కు తెలుగు వెలుగు నంది పురస్కారం



పురస్కారం అందుకున్న బల్లా నాగభూషణం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 15 : పట్టణానికి చెందిన సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు బల్లా నాగభూషణం తెలుగు వెలుగు నంది జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో కాళోజీ స్మారక సంస్థ, తెలుగు వెలుగు సాహితీ సంస్థల ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి ఆదివారం ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. ఇందులో భాగంగా నాగభూషణం అందిస్తున్న సేవలను గుర్తించి బీజేపీ అధికార ప్రతినిధి చందు సాంబశివరావు చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు.

ఆకట్టుకున్న సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచనాలు



ప్రవచనాలను వినిపిస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ

కొత్తూరు, సెప్టెంబరు 15 : అనకాపల్లి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి ప్రతిష్ఠా శతజయంతి ఉత్సవాలను నేత్రపర్వంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండో రోజైన ఆదివారం విశేష పూజలు జరిపారు. సామవేదం షణ్ముఖ శర్మ పరమేశ్వరి వైభవం ప్రవచనాలను భక్తులకు వినిపించారు. ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో-చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉప్పల శ్రీనివాసరావుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంట నష్టాన్ని త్వరితగతిన అంచనా వేయాలి

- సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు రామారావు



ఈకేవైసీ నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు రామారావు

సబ్బవరం, సెప్టెంబరు 15 : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ఈ-క్రాప్ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని అనకాపల్లి సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు సూచించారు. మండలంలోని బోదివలస, మలునాయుడుపాలెం గ్రామాల్లో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వరి పంటతో పాటు ఈకేవైసీ జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టాన్ని త్వరితగతిన అంచనా వేసి నివేదిక పంపించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, ఉద్యాన సహాయకులు బొబ్బరి లావణ్య, శ్రీనివాస్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు సంప్రదాయబద్ధంగా పవిత్రాల సమర్పణ

సింహాచలం, సెప్టెంబరు 15 : సింహగిరిపై జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారికి పవిత్ర సమర్పణం జరిపారు. ఉత్సవంలో భాగంగా సాయంత్రం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో పల్లకిలో ఉంచి మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు. పవిత్ర సమర్పణ విశిష్టతను స్థానాచార్యులు రాజగోపాల్ మీడియాకు వివరిస్తూ శాస్త్రవిధిని అనుసరించి పవిత్రాలను పరిమిత సంఖ్య సూత్రాలతో (పట్టు దారాలతో) ఉత్తమ, మధ్యమ, అధమ అను మూడు పరిమాణాల్లో తయారు చేస్తారన్నారు. వాటిని పవిత్రోత్సవాల రెండవ రోజున అధివాసం చేసి మూడవ రోజున ఆలయంలోని మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు, ఆళ్వార్లులకు, ఆలయ శిఖరాలకు సమర్పిస్తారని చెప్పారు. ఈమేరకు రాత్రి దర్శనాలు నిలిపివేసిన తరువాత విశేష హోమాలు, చతుర్వేద పారాయణలు, పురాణ, ఇతిహాది విన్నపాలు అనంతరం పవిత్ర సమర్పణ చేశారు.

పెట్రో వర్సిటీ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణానికి భూమి పూజ

విశాఖపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) శాశ్వత క్యాంపస్‌లో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈ శాశ్వత క్యాం పస్‌ను అనకాపల్లి జిల్లాలోని సబ్బవరం మండలంలో ఉన్న వంగలి గ్రామంలో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్యాం పస్‌లోనే అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణానికి భూమి పూజ చేశారు.

పది మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 15 : పట్టణంలోని పెరుగుబజార్ జంక్షన్ వద్ద ఒక వ్యక్తి నుంచి పది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బోకం రామకృష్ణ తెలిపారు. పూడిమడక రోడ్డులో నివాసం ఉంటున్న దాడి అప్పారావు మద్యం దుకాణంలో శనివారం రాత్రి మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి సంచిలో పట్టుకుని వెళుతున్నాడు. ఇంతలో అనుమానం వచ్చి సంచిని తనిఖీ చేయగా, పది మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయన్నారు. ఇందుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

సమైక్యం.. మార్గం సుగమం!

ఆ గ్రామాలకు బస్సు రావడమే గగనం.. అది కూడా ఎప్పుడు ఆగిపోతుందోనని భయం భయం.. మరో ప్రాంతంలో భారీ వర్షాలకు ఘాట్ రోడ్డులోకి మట్టి కొట్టుకురావడంతో రాకపోకలు అంతరాయం ఏర్పడుతుందన్న ఆందోళన. ఆ సమయం కూడా వచ్చేసినట్టుందని గ్రహించిన గిరిజనులు అధిక సంఖ్యలో తరలివచ్చి సమైక్యమయ్యారు. చేయి చేయి కలిపి శ్రమదానానికి పూనుకున్నారు. ఎంచెక్కా 'మార్గం' సుగమం చేసుకున్నారు. మన్యంలోని మిగిలిన గ్రామాలకు స్ఫూర్తిగా నిలిచారు.

- రహదారి క్లియరెన్స్‌కు నడుం బిగించిన గిరి యువత
- కిముడుపల్లి, వేంగడ ఘాట్ రోడ్లలో మరమ్మతు పనులు
- శ్రమదానానికి గ్రామాల నుంచి తరలివచ్చిన గిరిజనులు

పాడేరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాడేరు మండలానికి సరిహద్దున ఉన్న పెదబయలు మండలం కిముడుపల్లి గ్రామానికి చెందిన యూత్ కమిటీ సభ్యులను అందరూ ప్రశంసిస్తున్నారు. వారంతా ఐక్యంగా ఘాట్‌లోని ప్రమాదాలు జరగకుండా శ్రమదానంతో మట్టి తొలగింపు ప్రక్రియ చేపట్టడమే ఇందుకు కారణం. చాలా కాలంగా కురిసిన వర్షాలకు కిముడుపల్లి ఘాట్ మార్గంలోని ఎక్కడిక్కడ కొంచరియలు విరిగిపడి మట్టి రోడ్డుపైకి కొట్టుకువచ్చింది. దీంతో ఆ ఘాట్‌లో ప్రయాణాలు సాగించే వారికి తీవ్ర ఇబ్బందికరంగా మారింది.

పాడేరు మండలం గుత్తులపుట్టు, కించూరు, గొండెలి, డి.గొందూరు, డోకులూరు పంచాయతీలు, పెదబయలు మండలం కిముడుపల్లి, కుంతుర్ల, పెదకోడాపల్లి, గోమంగి పంచాయతీలకు చెందిన పదుల సంఖ్యలో పల్లెల గిరిజనులు కిముడుపల్లి ఘాట్ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఘాట్‌లో మట్టితో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న ఘటనలు స్వయంగా చూసిన కిముడుపల్లి గ్రామానికి చెందిన యూత్ కమిటీ ప్రతినిధులు, ఆ సమస్యను పరిష్కరించేందుకు తమవంతు కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. ఇదే అదనుగా శుక్ర, శనివారాలు శ్రమదానంతో కిముడుపల్లి ఘాట్‌లో అభ్యంతరంగా ఉన్న మట్టి పెళ్లలను తొలగించి, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చేశారు. దీంతో రెండు మండలాలకు చెందిన ఆయా ప్రాంత గిరిజనులు కిముడుపల్లి కుర్రోళ్లను అభినందిస్తున్నారు.



కిముడుపల్లి ఘాట్‌లో విరిగిపడిన మట్టి పెళ్లలను తొలగిస్తున్న గిరిజనులు

బస్సు ఆగిపోతుందన్న భయమే కదిలించింది..

అనంతగిరి: మారుమూల గ్రామాలకు బస్సు రావడమే గగనం.. వచ్చిన ఒక్క బస్సును రోడ్డు బాగోలేదని ఆపేస్తారెమోనన్న భయం.. ఇప్పుడదే మూడు గ్రామాల గిరిజనులు కదిలించింది. అధిక సంఖ్యలో వారు తరలివచ్చి శ్రమదానంతో రోడ్డును బాగుచేసుకున్నారు.



అనంతగిరి: వేంగడ రోడ్డు పక్కన గోతులను పూడ్చుతున్న గిరిజనులు

మండలంలోని మారుమూల వేంగడ పంచాయతీకి అరకు నుంచి ఉదయం, సాయంత్రం రెండుసార్లు ఆర్టీసీ బస్సు రాకపోకలు సాగిస్తున్నది. ఆయా గ్రామాల్లో వేసిన సెల్ టవర్లకు ఓహెచ్‌సీ కేబులు వేసేందుకు, పట్టణం నుంచి వేంగడ వరకు ఉన్న తారు రోడ్డును ఆనుకుని తవ్వకాలు జరిపారు. దీంతో వర్షాలకు రోడ్డంతా అధ్వానంగా తయారైంది. రహదారిలో గోతులు ప్రమాదకరంగా మారాయి. ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉండడంతో వేంగడ, గద్యవలస, కొత్తవస గ్రామాల నుంచి అధిక సంఖ్యలో గిరిజనులు కదిలారు. గునపం, పార చేతపట్టి శ్రమదానంతో రోడ్డు పక్కన గోతులను పూడ్చివేసి మార్గం సుగమం చేసుకున్నారు. గిరిజనులు చేసిన ఈ పనికి పలువురు వాహనదారులు అభినందనలు తెలిపారు.



ఆశ్రమ పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

డోకులూరులో సరస్వతీదేవి విగ్రహావిష్కరణ

పాడేరు రూరల్, సెప్టెంబరు 15: మండలంలోని డోకులూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాల ప్రాంగణంలో ఆదివారం సరస్వతీదేవి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పాడేరు పట్టణానికి చెందిన మోదకిరణ్ మణికంఠ అన్నదాన ట్రస్టు చైర్మన్ శివరాత్రి శ్రీనివాస్‌కుమార్ ఏర్పాటు చేసిన విగ్రహాన్ని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.బాబూరావునాయుడు, పాడేరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వతీదేవి నిలయమైన పాఠశాలల్లో దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో విద్యపై ఆసక్తి, దైవభక్తి పెరిగేందుకు దేవీ విగ్రహం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఆధ్యాత్మిక సేవా సంఘం సభ్యులు ఉప్పల వెంకటరత్నం, దేశిది బాబూరావు, కొట్టగుళ్లి రామారావు, సిద్ధినాతి కొండలరావు, రాంబాబు, ఎస్‌డీ.రవి, బీవీఎస్.ముకుందరావు, పెద్దిరెడ్డి దేముడు, పాఠశాల హెచ్‌ఎం.బాబూరావు, ఉపాధ్యాయులు వరలక్ష్మి, చిట్టిబాబు, పెద్దలు పాల్గొన్నారు.

పరుగు పందెంలో అమీర్‌బాషా సత్తా



రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన అమీర్ బాషాతో సిబ్బంది

సీలేరు, సెప్టెంబరు 15: సీలేరు డీఏవీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎస్‌కే అమీర్‌బాషా రాష్ట్ర స్థాయి 100, 200 మీటర్ల పరుగు పోటీల్లో ప్రతిభ చూపి ద్వితీయ స్థానంలో నిలిచాడు. విశాఖపట్నంలో ఈ నెల 13న జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడల్లో సత్తా చాటి త్వరలో జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరగనున్న జాతీయ క్రీడా పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రోత్సహించిన పీఈటీ కమలాకర్‌ను హెచ్‌ఎం కిరణ్‌కుమార్, ఎల్‌ఎంసీ చైర్మన్ రామభద్రరాజు, జెన్‌కో అధికారులు అభినందించారు.

ఘనంగా వినాయక విగ్రహ నిమజ్జనం



వినాయక విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్, సెప్టెంబరు 15: వినాయక నవరాత్రులు ఆదివారంతో పూర్తి కావడంతో మండలంలోని పలు ప్రాతాల్లో వినాయక నిమజ్జ కార్యక్రమాలను ఉత్సవ కమిటీ ప్రతినిధులు అంగరంగ వైభవంగా చేపట్టారు. పాడేరులో వివిధ ప్రధాన సెంటర్లలో ఏర్పాటు చేసిన విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలు సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ మందుగుండు సామగ్రితో భారీ ఊరేగింపు నిర్వహించారు. పాడేరులో నిర్వహించిన వినాయక నిమజ్జ ఊరేగింపు కార్యక్రమంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్ వారి కార్యాలయ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ఊరేగింపు కార్యక్రమంలో యువతులు బిందెలతో చేపట్టిన దింసా నృత్యం పలువురిని ఆకర్షించింది. మండలంలోని వంట్లమామిడి గ్రామంలో చేపట్టిన అనుపోత్సవంతో గ్రామ యువతీ, యువకులు పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు ఆనందోత్సహంగా చేపట్టారు. అదే విధంగా మండలంలోని చింతలవీధి, మినుములూరు, గుత్తులపుట్టు, రాయిగెడ్డ తదితర గ్రామాల్లో వినాయక నిమజ్జ కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో చేపట్టారు.

కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభాలు

కొయ్యూరు, సెప్టెంబరు 15: మండలంలోని శరభన్నపాలెం పంచాయతీ నిమ్మగెడ్డ గ్రామానికి వెళ్లే మార్గంలో విద్యుత్ స్తంభాలు కూలిపోయే స్థితికి చేరాయి. శరభన్నపాలెం నుంచి నిమ్మగెడ్డ గ్రామానికి 25 ఏళ్ల క్రితం విద్యుత్ సరఫరాకు వీలుగా విద్యుత్ లైన్ వేశారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర స్తంభాలు వేసి విద్యుత్ సరఫరా చేశారు. అప్పటి నుంచి స్తంభాలను మార్చలేదు. దీంతో సగానికి పైగా శిథిలం కాగా, మరికొన్నిచోట్ల పక్కకు వాలిపోయాయి. వర్షాకాలంలో గాలులకు ఈ స్తంభాలు ఏ క్షణంలో కూలిపోతాయోనని గ్రామస్థులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే స్తంభాలను మార్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నిమ్మగెడ్డ సమీపంలో కూలేందుకు స్థింగా ఉన్న స్తంభం

సీలేరులో చుక్కలనంటిన కూరగాయల ధరలు

- వర్షాలకు పంటలు దెబ్బతినడంతో భారీగా ధరల పెంపు
- గిరిజనులు రాకపోవడంతో వెలవెలబోయిన సంత

సీలేరు, సెప్టెంబరు 15: కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఆదివారం సీలేరులో జరిగిన సంతలో వ్యాపారులు అధిక ధరలకు విక్రయించడంతో సామాన్య మధ్య తరగతి కుటుంబాలు ఆందోళన వ్యక్తంచేశాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గిరిజనులు సాగు చేసిన కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. అలాగే మైదాన ప్రాంతాల నుంచి సీలేరుకు కూరగాయల వ్యాపారులు రాలేదు. కూరగాయలకు డిమాండ్ పెరగడంతో వ్యాపారులు ఇదే అదనుగా ధరలను పెంచి విక్రయించారు. కిలో ఆగాకరకాయలు రూ.160, కాలీఫ్లవర్ కిలో రూ.100, చిక్కుడుకాయలు, బీరకాయలు కిలో రూ.80, ఉల్లిపా యలు కిలో రూ.60, బెండకాయలు, దొండకాయలు, బీట్రూట్, క్యారెట్ కిలో రూ.60, టమాటా కిలో రూ.50, పచ్చిమిర్చి కిలో రూ.100కు విక్రయించారు. ఈ ధరలు చూసి సామాన్యులు బెంబేలెత్తిపోయారు. అయితే సంతకు తక్కువ కూరగాయలు రావడంతో ఎంత ధర చెల్లించైనా కొనుగోలు చేయక తప్పలేదు. భారీ వర్షాలకు సీలేరు సరిహద్దులోని పలు గ్రామాల గిరిజనులు పెద్దగా రాకపోవడంతో సంత వెలవెలపోయింది.



గిరిజనులు రాకపోవడంతో వెలవెలబోయిన సీలేరు సంత

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం

పాడేరు రూరల్, సెప్టెంబరు 15: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి మన్యంలోని వివిధ ప్రాంతాల భక్తులతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన వందలాది మంది భక్తులు హాజరు కావడంతో సాయంత్రం 5 గంటల వరకు ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. మైదాన ప్రాంత భక్తులు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోనే వంటలు చేసుకొని బంధుమిత్రులతో ఉత్సాహంగా పండగ జరుపుకున్నారు. కాకినాడకు చెందిన జిల్లా స్కిల్ డెవలప్ మెంట్ అధికారి యశోద కృష్ణ దంపతులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. వారిని ఆలయ కమిటీ ప్రతినిధులు శాలువతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే ఘాట్‌లోని మోదకొండమ్మ అమ్మవారి పాదాల వద్దకు మైదాన ప్రాతానికి చెందిన భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు

- ఈపీడీసీఎల్ ఏఈఈ ప్రభాకరరావు

చింతపల్లి, సెప్టెంబరు 15: సబ్ డివిజన్ పరిధిలో గిరిజన గ్రామాలకు పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని ఏపీఈపీడీసీఎల్ ఏఈఈ వనుము ప్రభాకరరావు తెలిపారు. నిమ్మచెట్టు గ్రామంలో జరుగుతున్న పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ రాత్రి కురిసిన భారీ వర్షాలకు చింతపల్లి, జీకే వీధి మండలాల్లో పలు గ్రామాల్లోని విద్యుత్ లైన్లు తెగిపోయాయన్నారు. అలాగే స్తంభాలు నేలకొరిగాయని చెప్పారు. దీంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. ప్రధానంగా గూడెంకొత్తవీధి మండలంలోని గుమ్మిరేవులు, ధారకొండ, దుప్పులవాడ పంచాయతీల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు ప్రారంభించామన్నారు. రెండు, మండలాల్లో 90 శాతం విద్యుత్ స్తంభాలు కూలిపోయాయన్నారు. పలు చోట్ల భారీగా విద్యుత్ వైర్లు తెగిపోయాయన్నారు. విరిగిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ లైన్లు నిర్మించామన్నారు. నిమ్మచెట్టు గ్రామానికి వెళ్లేందుకు వాగులు అడ్డంకిగా మారడంతో పునరుద్ధరణ పనులు ఆలస్యమయ్యాయని చెప్పారు. సాయంత్రానికి నిమ్మచెట్టు గ్రామానికి కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరించామన్నారు. రెండు మండలాల్లో శతశాతం విద్యుత్ పునరుద్ధరణ పనులు జరిగాయన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

సీలేరు, సెప్టెంబరు 15: సీలేరు సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం అగ్ర నేత సీతారాం ఏచూరి మృతికి ఆదివారం సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలను వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీతారాం చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు ఎస్‌కే సుభాన్, నాయకులు చింతా రాంబాబు, బి.లక్ష్మణ్, టి.విష్ణుకుమార్‌రాజు, జెన్‌కో కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెనలు



చుట్టుమెట్ట సమీపంలో రక్షణ గోడ లేని వంతెన

పెదబయలు, సెప్టెంబరు 15: పాడేరు-పెదబయలు ప్రధాన రహదారి వద్ద పలుచోట్ల వంతెనలు ప్రమాదభరింతగా మారాయి. పెదబయలు మండలం అరడకోట పంచాయతీలో అరడకోట-చుట్టుమెట్ట మధ్య గల దశాబ్దాల నాటి వంతెన ఓ వైపు రక్షణ గోడ పూర్తిగా కూలిపోయింది. దీంతో అటువైపుగా ప్రయాణించాలంటే వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. దీనికితోడు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు పెరిగిపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ మార్గంలోనే ప్రజాప్రతినిధుల, ఉన్నత స్థాయి అధికారులు అనునిత్యం తిరుగుతున్నా రక్షణ గోడ మరమత్తు పనులు చేపట్టే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనలకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

చర్మ వ్యాధుల నివారణకు మందుల పంపిణీ

హుకుంపేట, సెప్టెంబరు 15: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు చర్మ వ్యాధులు సోకకుండా ఐటీడీఏ పీవో అభిషేక్ తన సొంత నిధులతో మందులు సమకూర్చారు. వీటిని ఆదివారం మండల కేంద్రంలోని ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులకు వార్డెన్ సాగిరి తేజ అందజేశారు. గజ్జి, తామర తదతర వ్యాధులతో బాధపడుతున్న విద్యార్థులు ఈ మందులను సక్రమంగా వినియోగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల ఒడిలో ఆశ్రమ బడి

... 5వ పేజీ తరువాయి

చెబుతున్నారు. కాగా గత ఎనిమిది నెలలుగా అసంపూర్తి భవనాలు దర్శనమిస్తున్నాయి. దీని వల్ల ప్రస్తుతం ఉన్న చాలీచాలని గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణాలు పూర్తి చేసి విద్యార్థుల వసతి సమస్య తీర్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై పాఠశాల హెచ్‌ఎం ప్రభుదాస్‌ను సంప్రతించగా నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు రూ.8 లక్షల నిధులు, సామగ్రి సిద్ధంగా ఉన్నాయన్నారు. సిమెంట్ లేకపోవడంతో పనులు జరగడం లేదని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారని, వసతి సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనని తెలిపారు.

ఒకేసారి రెండు డిగ్రీలు

... 5వ పేజీ తరువాయి

సంబంధించిన కరసత్తు చేస్తున్నట్టు వర్సిటీ అధికారులు చెబుతున్నారు. రెండు మేజర్ సబ్జెక్టులు పూర్తిచేసినట్టుగానే విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించనున్నారు.

ఇంజనీరింగ్‌లో అమలు..

ఏయూ ఇంజనీరింగ్ కాలేజీలో ప్రస్తుతం డ్యూయల్ డిగ్రీ విధానాన్ని అమలు చేస్తున్నారు. అయితే, పేరెంట్ డిపార్టుమెంట్ మేజర్ సబ్జెక్ట్‌గా, ఎంపిక చేసుకున్న డిపార్టుమెంట్ మైనర్ సబ్జెక్ట్‌గా ప్రస్తుతం అమలు చేస్తున్నారు. మూడో ఏడాది చదువుతున్న విద్యార్థులకు ప్రస్తుతం ఈ అవకాశం కల్పిస్తున్నారు. మైనర్ డిగ్రీ పొందాలనుకునే విద్యార్థులు రెగ్యులర్ సబ్జెక్టులతోపాటు అదనంగా నాలుగు సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఇనుస్ట్రుమెంటేషన్, కెమికల్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెటలర్జీ, మెరైన్, పర్యావరణ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు మైనర్ డిగ్రీగా కంప్యూటర్ సైన్స్ అందించనున్నారు. వీరికి డేటా స్ట్రక్చర్, సీ లాంగ్వేజ్, పైథాన్, మ్యాట్ లాబ్ వంటి కోర్సులు నేర్పిస్తారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీలో అన్ని బ్రాంచీల విద్యార్థులకు సీఎస్ఈ చదివే అవకాశం ఇవ్వనున్నారు. మూడు, నాలుగో ఏడాదిలో మైనర్ డిగ్రీ చదివాల్సి ఉంటుంది.

వైద్యురాలి బదిలీ సబబేనా?

... 5వ పేజీ తరువాయి

డిప్యూటేషన్, బదిలీపై వెళ్లాల్సి వచ్చినా పీవో అనుమతి తప్పనిసరిగా ఉండాలి. గిరిజన ప్రాంతంలో సింగిల్ అడ్మిస్ట్రేషన్ అధికారాలు పీవోకి ఉంటాయి. కనీసం ఐటీడీఏ పీవో, కలెక్టర్ అనుమతి తీసుకోకుండా గైనికాలజిస్టును నర్సీపట్నం సీఎస్ఆర్ఎంవోగా బదిలీ చేశారు. అయితే ఆమె స్థానంలో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి ఎవరిని నియమించకపోవడం గమనార్హం. సుధాశారద నర్సీపట్నం వెళ్లిపోతే చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో గైనికాలజిస్టు పోస్టు ఖాళీగా ఉంటుంది. స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆమెతో పాటు ముగ్గురు గైనికాలజిస్టులు ఉన్నారు. ఒకరు ప్రస్తుతం మెడికల్ సెలవులో ఉన్నారు. ఇప్పుడు ఇద్దరు మాత్రమే విధుల్లో ఉన్నారు. వీరిలో సుధాశారద నర్సీపట్నం వెళ్లిపోతే, ఒక్క గైనికాలజిస్టు మాత్రమే ఆస్పత్రిలో ఉంటారు. దీంతో ఆమె సెలవు పెట్టినా, వారంతరపు సెలవు తీసుకున్నా గైనికాలజిస్టు అందుబాటులో ఉండే పరిస్థితి ఉండదు. ఇప్పటికే ఏరియా ఆస్పత్రిలో ఎనస్థీషియా వైద్యులు అందుబాటులో లేక సిజేరియన్లు జరగడం లేదు. గిరిజన ప్రాంతంలో వైద్యుల ఖాళీలను భర్తీ చేయాల్సిన ఏపీవీవీపీ అధికారులు ఇక్కడ నుంచి మైదాన ప్రాంతాలకు అర్థంతరంగా వైద్యురాలిని బదిలీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించకపోతే చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలకు స్త్రీ వైద్య నిపుణుల వైద్యసేవలు దూరమవుతాయని పలువురు వాపోతున్నారు.

ప్రతి శుక్రవారం విద్యుత్ లైన్ల నిర్వహణ

... 5వ పేజీ తరువాయి

వంతు కొరత ఉందని, అయినా ఎక్కడా సేవలకు లోపం లేకుండా పనులు చేయిస్తున్నామని చెప్పారు. ఎటువంటి ఫిర్యాదు ఉన్నా గృహ వినియోగదారులైతే ఆరు గంటల సమయంలోనే దానిని పరిష్కరిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు వారికి ఏ సమస్య ఉన్నా 1912 నంబరుకు కాల్ చేస్తే ఫిర్యాదు స్వీకరిస్తారని, దాని పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని, వాటిని ఉన్నతాధికారులు కూడా పర్యవేక్షిస్తుంటారని సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు.

ఏ పని ఉన్నా అధికారులనే సంప్రతించండి

విద్యుత్‌కు సంబంధించి ఎటువంటి పనులు ఉన్నా స్థానికంగా ఉంటే ఏఈ కార్యాలయంలో సంప్రతించాలని, ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో వారే సూచిస్తారని సీఎండీ వివరించారు. విద్యుత్ పనులు చేయిస్తామని దళారులు చాలామంది వెంటపడతారని, వారిని నమ్మవద్దని సూచించారు. అలా చేస్తే కాలయాపనతో పాటు ఎక్కువ డబ్బు ఖర్చు అవుతుందన్నారు.

సంక్షిప్తంగా..



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

చింతపల్లి, సెప్టెంబరు 15: స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (సెబ్)ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడంపై ఎక్సైజ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు స్థానిక సెబ్ పోలీసు స్టేషన్‌లో ఉద్యోగులు ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజు మాట్లాడుతూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్‌గా బ్యూరోగా మార్చడంతో ఎక్సైజ్ ఉద్యోగులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. తమ శాఖ ఉన్నతాధికారుల అభ్యర్థన మేరకు సెబ్‌ను రద్దు చేయడం సంతోషకరంగా ఉందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ కరుణ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.25 లక్షలతో ప్రణాళిక

పాడేరు రూరల్, సెప్టెంబరు 15: జిల్లా కేంద్రంలో పాడేరులోని అతి పురాతన ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రూ.25 లక్షలతో ప్రణాళికను రూపొందించామని ఆలయ కమిటీ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక సేవా సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీలకంఠేశ్వర స్వామివారి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో వివిధ దేవతామూర్తుల విగ్రహాలు ఉండడంతో భక్తుల సందర్శన పెరుగుతున్నదని, దీంతో ఆలయ ప్రాంగణంలో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేవాలయ కార్యాలయ, మరుగుదొడ్ల నిర్మాణంపై కమిటీ చర్చించి తీర్మానం చేసినట్టు ఆయన తెలిపారు. రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ముఖ మండపం నిర్మాణం వేగవంతం చేయడానికి, ఆలయంలో సుందరీకరణ పనులు, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల నిర్వహణపై ఉప కమిటీల ఏర్పాటుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవ కమిటీ ఏర్పాటు





అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ.. శ్రీనివాస్

పాడేరు రూరల్, సెప్టెంబరు 15: పట్టణంలోని మెయిన్ బజారులో దేవీ ఉత్సవాల నిర్వహణకు ఆదివారం కమిటీని ఏర్పాటు చేశారు. వచ్చే నెల 8 నుంచి 12వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు కమిటీ అధ్యక్షుడిగా వెయ్యాకుల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా గంగపూజారి శివకుమార్, బోనంగి రమణ, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి శ్రీనివాసు, కార్యదర్శిగా ఎస్.మోదకొండబాబు, సహాయ కార్యదర్శులుగా కూడి రామునాయుడు, మహ్మద్ తాజ్‌ఉద్దీన్, పాపాన వెంకట్, కోశాధికారులుగా బూరెడ్డి రామునాయుడు, పచ్చా రవీంద్ర, గౌరవ సలహాదారులుగా వర్తన పిన్నయ్యదొర, పచ్చా మాణిక్యాలరావు, శివరాత్రి నాగేశ్వరరావు, పూసర్ల గోపి, బూరెడ్డి కృష్ణారావు, ఆకాశపు సోమరాజు, రొబ్బి శంకరరావు, బూరెడ్డి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా ప్రతాప్, బి.కొండబాబు, ఈ.చంటి, ఎస్.సురేష్‌కుమార్‌లను ఎంపిక చేశారు.

క్షతగాత్రులకు బాలరాజు పరామర్శ

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 15: కొండచరియలు విరిగి పడడంతో తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చట్రాపల్లి గిరిజనులను మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు పరామర్శించారు. ఆదివారం కేజీహెచ్‌కి వెళ్లిన మాజీ మంత్రి బాధితులతో మాట్లాడారు. చట్రాపల్లిలో జరిగిన సంఘటనను మాజీ మంత్రి బాధితులు సుమిత్ర, పండన్నను అడిగి తెలుసుకున్నారు. కేజీహెచ్‌లో వైద్యులు మెరుగైన చికిత్స అందిస్తున్నట్టు బాధితులు మాజీ మంత్రికి వివరించారు. దీంతో మాజీ మంత్రి మాట్లాడుతూ చట్రాపల్లి గిరిజనులను ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆదుకోవాలన్నారు.

ఎస్ఐగా సురేష్ బాధ్యతలు



ఎస్ఐ ఎల్.సురేశ్

హుకుంపేట, సెప్టెంబరు 15: హుకుంపేట ఎస్ఐగా ఎల్.సురేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి జిల్లాలోని రోలుగుంట మండలంలో ఎస్ఐగా విధులు నిర్వహించిన ఆయన, సాధారణ బదిలీల్లో ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన సతీష్ అనకాపల్లి జిల్లాలోని చీడికాడ మండలానికి బదిలీ చేశారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ మండల ప్రజలు, నాయకులతో సమిష్టంగా ఉండి ఎటువంటి ఇబ్బందులు తల్తెకుండా ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు సహకారం అందించాలని కోరారు.

న్యాయ అవగాహన సదస్సు

పాడేరు (జి.మాడుగుల), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జి.మాడుగుల మండలంలోని గెమ్మెలి పంచాయతీ సంపంగిపుట్టు గ్రామంలో ఆదివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, కార్యర్శులు అప్పాజీ, సురేశ్ గిరిజనులకు చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టాలకు లోబడి తమ జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, చట్ట వ్యతిరేక చర్యలకు దూరంగా ఉండాలని వారు సూచించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయంలో అన్నదానం

పాడేరు రూరల్, సెప్టెంబరు 15: మోదకొండమ్మ ఆలయంలో వారానికి మూడు రోజులు అన్నదానం చేస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు తెలిపారు. సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి ప్రారంభించారు. ప్రస్తుతం ఆలయంలో ఆది, మంగళ, శుక్రవారం మాత్రమే అన్నదానం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ఆదివారం కార్యక్రమంలో పీవో వి.అభిషేక్ తండ్రి విజయకుమార్, కమిటీ ప్రతినిధులు బి.రమణ, సల్ల రామకృష్ణ, కొణతాల సతీష్, జి.శంకరరావు, జి.ప్రకాష్ పాల్గొన్నారు.